బిక్కేరు నుంచి బిరబిరా..

యథేచ్ఛగా ఇసుక రవాణా
- అనుమతి లేకుండా తరలింపు
- సీసీ కెమెరాల్లో రికార్డు అవుతున్నా పట్టించుకోని అధికారులు
- రూ.లక్షల్లో ప్రభుత్వ ఆదాయానికి గండి


బిక్కేరు వాగులో ఇసుక లోడ్‌లతో వెళ్తున్న ట్రాక్టర్లు

తిరుమలగిరి : తిరుమలగిరి మండలం తాటిపాముల, నందాపురం, అనంతారం గ్రామాల గుండా ప్రవహించే బిక్కేరు వాగులో గత కొన్ని నెలలుగా ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా కొనసాగుతోంది. రాత్రయితే చాలు వరుసకొద్ది ట్రాక్టర్లలో అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్నారు. తాటిపాముల, అనంతారం గ్రామాల నుంచి అయితే ఏకంగా పగలు కూడా ఇసుక అక్రమ రవాణా జోరుగా నడుస్తోంది. ఈ ఇసుకను తిరుమలగిరి మున్సిపాలిటీతోపాటు వివిధ గ్రామాలకు, జనగామ జిల్లా కొడకండ్ల, పాలకుర్తి, పెద్దవంగర మండలాలకు తరలిస్తున్నారు. ఇసుక అక్రమ రవాణా చేస్తూ సీసీ కెమెరాల్లో రికార్డు అవుతున్నా సంబంధిత వ్యక్తులపై అధికారులు చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. ఎలాంటి అనుమతులు లేకుండానే ఇష్టానుసారంగా ఇసుక తరలిస్తుండటంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది. ఇసుకను పెద్ద మొత్తంలో తరలిస్తుండటంతో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. బోర్లలో నీరు అడుగంటిపోతుందని, పొలాలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఈ విషయమై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. అక్రమంగా తరలిస్తున్న ఇసుకను నిర్వాహకులు దూర ప్రాంతాలకు తరలించి ఒక్కో ట్రాక్టర్‌కు రూ.2500 నుంచి రూ.నాలుగైదు వేల వరకు అమ్ముతున్నట్లు సమాచారం.

లైసెన్స్‌లు లేని డ్రైవర్లు..

ఇసుకను తరలిస్తున్న అక్రమార్కులు ఎక్కువగా మైనర్లతోనే వాహనాలను నడిపిస్తున్నారు. ఇసుక ట్రాక్టర్లకు నంబర్లు కూడా వేయడం లేదు. దీనికి తోడు రాత్రి వేళల్లో ఎక్కువ ట్రిప్పులు కొట్టాలన్న ఆశతో చాలా వేగంగా వాహనాలను నడుపుతున్నారు. మద్యం మత్తులో కూడా ఇష్టానుసారంగా వాహనాలు నడుపుతుండటంతో ప్రతి రోజూ ఏదో ఒకచోట ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇంత జరుగుతున్నా అధికారులు తనిఖీలు చేయడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు.

నిఘా ఎక్కడ..?

ప్రతిరోజూ రాత్రివేళల్లో ఇసుక ట్రాక్టర్లు స్థానిక తెలంగాణ చౌరస్తా నుంచే వెళ్తున్నాయి. చౌరస్తాలో సీసీ కెమెరాల్లో నమోదు అవుతున్నా కేసులు మాత్రం ఎప్పుడో ఓసారి నమోదు చేస్తున్నారు. గస్తీ కాసే పోలీసులు సైతం చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. రాత్రివేళల్లో నడిచే ఇసుక ట్రాక్టర్ల నుంచి ఒక్కో ట్రాక్టర్‌కు రూ.500 వరకు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. కిందిస్థాయి సిబ్బంది ట్రాక్టర్ యజమానులకు అధికారుల సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందిస్తూ ఇసుక అక్రమ రవాణాకు సహాయ సహకారాలు అందిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా అధికారులు ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాలని, అక్రమార్కులపై కేసులు నమోదు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే చర్యలు

లైసెన్స్ లేకుండా వాహనాలు, ఇసుక ట్రాక్టర్లు నడిపితే కేసులు నమోదు చేస్తాం. వాహనాలకు నంబర్ ప్లేట్లు తప్పనిసరిగా ఉండాలి. నంబర్ ప్లేట్లు లేకుండా వాహనాలు నడిపినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటాం. – రాజేష్, సీఐ, నాగారం

ఎవరికీ పర్మిషన్లు ఇవ్వలేదు



బిక్కేరు వాగు నుంచి ఇసుకను తీయడానికి ప్రస్తుతం ఎవరికీ పర్మిషన్లు ఇవ్వలేదు. అక్రమంగా ఇసుకను తరలిస్తే కేసులు నమోదవుతాయి. బిక్కేరు వాగు వద్ద సిబ్బందితో పర్యవేక్షణ చేయిస్తాం. – రమణారెడ్డి, తహసీల్దార్, తిరుమలగిరి

బాధితులకు మంత్రి పరామర్శ


పెన్‌పహాడ్ : రవిని పరామర్శిస్తున్న మంత్రి


నాగారం : మధుసూదన్‌రెడ్డిని పరామర్శిస్తూ..

పెన్‌పహాడ్ : సింగారెడ్డిపాలెం గ్రామానికి చెందిన రైతు రవి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్నాడు. దీంతో మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి శనివారం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో ఆయనను పరామర్శించారు.

మధుసూదన్‌రెడ్డికి పరామర్శ

నాగారం : మంత్రి సొంత గ్రామమైన నాగారం మండల కేంద్రానికి చెందిన కడారి మధుసూదన్‌రెడ్డి అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ సందర్భంగా మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి శనివారం ఆయనను ఆస్పత్రిలో పరామర్శించారు. రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు ఓఎస్‌డీ డాక్టర్ గంగాధర్ పర్యవేక్షణలో మధుసూదన్‌రెడ్డికి వైద్యచికిత్సలు జరిపించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ఆయనతోపాటు బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

కేసీఆర్ ప్రభుత్వంతో రైతులకు మానసిక వేదన


మాట్లాడుతున్న సంకినేని వెంకటేశ్వర్‌రావు

ఆత్మకూర్ (ఎస్) : పంటలకు సరిపడా కరెంటును ఇవ్వకపోగా ఆటోమెటిక్ స్టార్టర్లను తొలగిస్తూ కేసీఆర్ ప్రభుత్వం రైతులను మానసిక వేదనకు గురిచేస్తోందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం మండల పరిధిలోని బోరింగ్ తండా, కొత్త తండా గ్రామాల్లో నిర్వహించిన ప్రజాగోస – బీజేపీ భరోసా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రైతులను ఇబ్బందుల పాలు చేసిన ఏ ప్రభుత్వం మనుగడ సాగించిన దాఖలాలు లేవని, కేసీఆర్ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని అన్నారు. సూర్యాపేట నియోజకవర్గంలో రైతులు ఇబ్బందులు పడుతుంటే పర్సంటేజీలు లేని పనులు నాకెందుకులే అన్నట్లుగా మంత్రి జగదీశ్‌రెడ్డి వ్యవహరిస్తున్నారని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చి రైతుల ఇబ్బందులను తొలగిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా గుగులోతు నాగునాయక్, లింగానాయక్, భుక్యా భిక్షంలతో పాటు 50 మంది బీజేపీలో చేరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు పందిరి రాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి పాటి కరుణాకర్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ ఎండీ.అస్లాం, శక్తికేంద్రం ఇన్‌చార్జ్ యాదగిరిగౌడ్, పందిరి మాధవరెడ్డి, బానోతు భిక్షం, వెంకన్న, కోట్యా తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో అధిక ఆదాయం


వర్ధమానుకోటలో ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ గణేష్

నాగారం : రైతులు వరికి ప్రత్యామ్నాయంగా ఆయిల్‌పామ్ పంటను సాగు చేసి, అధిక ఆదాయం పొందాలని మండల వ్యవసాయశాఖ అధికారి పెండోట గణేష్ అన్నారు. శనివారం వర్ధమానుకోట రైతువేదికలో పతాంజలి ఫుడ్స్ లిమిటెడ్ ఆయిల్‌పామ్ కంపెనీ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించి మాట్లాడారు. నీటి వసతి ఉన్న రైతులు ఆయిల్‌పామ్ పంట సాగు చేసుకోవాలన్నారు. ఆయిల్‌పామ్ సాగు చేసిన రైతులకు మార్కెటింగ్ ఇబ్బందులు లేకుండా పంటను నేరుగా కంపెనీ కొనుగోలు చేస్తుందని తెలిపారు. ఆయిల్‌పామ్ పంటలు సాగు చేసే రైతులకు ప్రభుత్వం అందించే రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ పసిమా, పతాంజలి ఫుడ్స్ లిమిటెడ్ ఆయిల్‌పామ్ కంపెనీ ఫీల్డ్ ఆఫీసర్ రంగు ముత్యంరాజు, రైతులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో అద్భుత క్షేత్రంగా సూర్యదేవాలయం


మున్సిపల్ చైర్‌పర్సన్‌కు స్వామి చిత్రపటాన్ని బహూకరిస్తున్న క్షేత్ర వ్యవస్థాపకుడు జనార్దన్‌రెడ్డి

అర్వపల్లి : రాష్ట్రంలో అద్భుతమైన క్షేత్రంగా తిమ్మాపురంలోని సూర్యక్షేత్రం నిలిచిపోతుందని జనగామ జిల్లా మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమున అన్నారు. శనివారం ఆమె తిమ్మాపురంలో ఉన్న సూర్యక్షేత్రాన్ని సందర్శించి మాట్లాడారు. రాష్ట్రంలో ఏకైక సూర్యక్షేత్రం ఇక్కడే ఉందని తెలిసి క్షేత్రాన్ని సందర్శించినట్లు చెప్పారు. రాబోయే రోజుల్లో ఈ క్షేత్రం దేశంలో ప్రముఖ క్షేత్రంగా మారనుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమెను క్షేత్ర వ్యవస్థాపకుడు కాకులారపు జనార్దన్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. సూర్యనారాయణస్వామి చిత్రపటాన్ని బహూకరించారు. ఈ కార్యక్రమంలో గనపురం నరేష్, అర్చకుడు శ్రీనివాసశర్మ, భక్తులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీసీసీబీ డైరెక్టర్

తుంగతుర్తి : వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఎంపీటీసీ చెరుకు సృజనపరమేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు దోహదపడతాయని తెలిపారు. ప్రజలు చలివేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య, బీఆర్‌ఎస్ నాయకులు గుండగాని రాములుగౌడ్, నల్లు రామచంద్రారెడ్డి, కటకం వెంకటేశ్వర్లు, రమేష్, శ్రీనివాస్, దీప్లానాయక్, సాయికిరణ్, యల్లయ్య, నాగయ్య, మల్లేష్, సాయిరాం, మధు, సాయి, సురేష్, శేఖర్, మల్లికార్జున్, నితీన్, అవిలయ్య, చింటూ, మనోహర్, మహేష్, ప్రసాద్, కృష్ణ, సతీష్, ప్రభాకర్, వీరయ్య పాల్గొన్నారు.

జీవాలకు నట్టల నివారణ మందు తాపించాలి

అర్వపల్లి : జీవాలకు నట్టల నివారణ మందు తాపించాలని మండల పశు వైద్యాధికారి డాక్టర్ బి.అర్జున్ అన్నారు. శనివారం కొమ్మాలలో నట్టల నివారణ మందు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించి మాట్లాడారు. ఏడాదికి రెండుసార్లు ఈ మందు ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వీఎల్‌ఓ కేవీఎస్ పద్మ, మర్యాద వెంకన్న, అవిలయ్య, బయ్య భాస్కర్, నారాయణ పాల్గొన్నారు.

నాగారం : జీవాలకు వ్యాధులు సోకకుండా పెంపకందారులు అప్రమత్తంగా ఉండాలని సర్పంచ్ గట్టు నర్సింహారావు అన్నారు. శనివారం మండల పరిధిలోని ఫణిగిరి గ్రామంలో పశుసంవర్థకశాఖ ఆధ్వర్యంలో నట్టల నివారణ మందు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో 1,231 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు తాపించారు. ఈ కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి డాక్టర్ బత్తుల రవి, ఎల్‌ఎస్‌ఏ మురళి, సిబ్బంది మధుసూదన్, విజయ్, జీవాల పెంపకందారులు మద్రిమేకల లింగయ్య, గొగుళ్ల లింగమల్లు, బత్తుల కృష్ణమూర్తి, బత్తుల వెంకన్న, బుక్కరాజు నవీన్ పాల్గొన్నారు.

కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం


పాలాభిషేకం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

అర్వపల్లి : అర్వపల్లిలోని శ్రీయోగానందలక్ష్మీనర్సింహస్వామి ఆలయ అభివృద్ధికి రూ.5కోట్లు మంజూరు చేయడాన్ని హర్షిస్తూ శనివారం ఆలయం ఎదుట బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్, మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యే కిశోర్‌ల చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. అంతకుముందు ఆలయంలో పూజలు జరిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మన్నె రేణుకలక్ష్మీనర్సయ్యయాదవ్, జెడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్, మండల అధ్యక్షుడు గుండగాని సోమేష్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ కుంట్ల సురేందర్‌రెడ్డి, పందిరి ఎర్రనర్సయ్య, ఆలయ చైర్మన్ సీహెచ్.విద్యాసాగర్, సర్పంచ్ బైరబోయిన సునీతరామలింగయ్య, ఎంపీటీసీ కనుకు పద్మశ్రీనివాస్, ఉపసర్పంచ్ పి.ప్రభాకర్ పాల్గొన్నారు.

నేరాల నిర్ధారణలో సీసీ కెమెరాలు కీలకం


సీసీ కెమెరాల ఏర్పాటులో పోలీసులు, గ్రామస్తులు

మద్దిరాల : నేరాల నిర్ధారణలో సీసీ కెమెరాల పాత్ర కీలకమని ఏఎస్‌ఐ నాగయ్య అన్నారు. శనివారం మామిళ్లమడవ గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటు కార్యక్రమంలో మాట్లాడారు. బీఆర్‌ఎస్ మండల యువజన నాయకుడు మల్లు ఉపేందర్‌రెడ్డి పార్టీలకు అతీతంగా చొరవ తీసుకొని సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేయడం అభినందనీయమన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు సహాయ సహకారాలు అందించిన దాతలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ మల్లయ్య, నారాయణరెడ్డి, వీరస్వామి, మల్లు కళింగారెడ్డి, జలేందర్, సురేందర్‌రెడ్డి, నవిలా మల్సూర్ పాల్గొన్నారు.

యోగానంద ఆలయాన్ని ప్రసిద్ధ క్షేత్రంగా తీర్చిదిద్దుతా


అర్వపల్లిలో ఎమ్మెల్యేను ఎత్తుకొని ఊరేగిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు


నాగారం : పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్

అర్వపల్లి : అర్వపల్లిలోని శ్రీయోగానందలక్ష్మీనర్సింహస్వామి ఆలయాన్ని జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా తీర్చిదిద్దనున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ గాదరి కిశోర్‌కుమార్ చెప్పారు. నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలంలో శనివారం పర్యటన ముగించుకొని సూర్యాపేట జిల్లా కేంద్రానికి వెళ్తుండగా అర్వపల్లిలో బీఆర్‌ఎస్ శ్రేణులు, గ్రామస్తులు, భక్తులు, ఆలయ అర్చకులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను జెడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్, ఆలయ చైర్మన్ చిల్లంచర్ల విద్యాసాగర్, బైరబోయిన రామలింగయ్య, కనుకు శ్రీనివాస్, ఉపసర్పంచ్ ప్రభాకర్‌లు భుజాలపై ఎత్తుకొని ఊరేగించారు. తమ ఆలయానికి రూ.5కోట్లు మంజూరు చేయడాన్ని హర్షిస్తూ బాణసంచాలు కాల్చి ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ఆలయ విశిష్టతను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి రూ.5కోట్లు మంజూరు చేయించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మన్నె రేణుకలక్ష్మీనర్సయ్యయాదవ్, జెడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్, చైర్మన్ సీహెచ్.విద్యాసాగర్, సర్పంచ్ సునీతరామలింగయ్య, ఎంపీటీసీ కె.పద్మశ్రీనివాస్, మండల అధ్యక్షుడు గుండగాని సోమేష్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ కుంట్ల సురేందర్‌రెడ్డి, కోఆర్డినేటర్ పందిరి ఎర్రనర్సయ్య, మొరిశెట్టి ఉపేందర్, కాపా వెంకటేశ్వర్‌రావు, బి.రామలింగయ్య, మార్కెట్ డైరెక్టర్లు అనిరెడ్డి శేఖర్‌రెడ్డి, ఖమ్మంపాటి నరేష్, కొప్పుల సోమిరెడ్డి, బి.వెంకన్న, దేవస్థాన డైరెక్టర్లు ఎం.సురేష్, కె.మల్లయ్య, పి.ప్రభు, నర్సయ్య, భిక్షం, పందిరి యుగేందర్, అర్చకులు రాంబాబుఅయ్యంగార్, ఆనంద్‌దీక్షిత్, పవన్‌కుమార్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ


చివ్వెంల : మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే

చివ్వెంల : మండల పరిధిలోని దురాజ్‌పల్లి గ్రామంలో నివాసం ఉంటూ సూర్యాపేట రూరల్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న దొడ్డి మధు ఇటీవల ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సందర్భంగా మృతుడి చిత్రపటానికి శనివారం ఎమ్మెల్యే గాదరి కిశోర్ నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో పెన్‌పహాడ్ ఎంపీపీ నెమ్మాది భిక్షం, జెడ్పీటీసీ జీడి భిక్షం, పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల పోస్టర్ల ఆవిష్కరణ

నాగారం : ఫణిగిరిలో మార్చి 3 నుంచి 14వ తేదీ వరకు జరిగే శ్రీ సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాల పోస్టర్లను శనివారం ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ తిరుమలగిరిలోని తన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామంలో ప్రతి ఏడాది సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కల్లెట్లపల్లి ఉప్పలయ్య, ఆలయ చైర్మన్ ఆవుల సతీష్, వైస్‌చైర్మన్ మామిడి మల్లయ్య, నాతి మహేష్, శేఖర్‌రెడ్డి, జంపాల రాజు, గట్టు వెంకటనారాయణ, లాజర్, జాన్‌వెస్లీ, తీగుళ్ల యాదగిరి, సోమయ్య, చిరంజీవి, సుధాకర్, రాములు, మాణిక్యం, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో స్వపరిపాలన దినోత్సవం


చివ్వెంల : వట్టిఖమ్మంపహాడ్ పాఠశాలలో స్వపరిపాలన వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు


నాగారం ప్రాథమిక పాఠశాలలో..


పెన్‌పహాడ్ : లాల్‌సింగ్ తండా పాఠశాలలో..

చివ్వెంల : మండల పరిధిలోని వట్టిఖమ్మంపహాడ్ గ్రామ ప్రాథమిక పాఠశాలలో శనివారం విద్యార్థులు స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వేములపల్లి జయశ్రీ, ఎ.రామకృష్ణ నాయక్, జి.మోహన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని లాల్‌సింగ్ తండా ప్రాథమిక పాఠశాలలో శనివారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు గవాస్కర్‌రెడ్డి, యర్రంశెట్టి నిర్మల తదితరులు పాల్గొన్నారు.

నాగారం : మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు శనివారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎంసీ చైర్మన్ దివ్వెలపల్లి మల్లేష్, ప్రధానోపాధ్యాయుడు వి.మల్లయ్య, ఉపాధ్యాయులు వెంకటమల్లు, వీరేష్, రవీనా, విద్యార్థులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలు ధరించి విద్యుత్ ఉద్యోగుల నిరసన


నిరసన తెలుపుతున్న విద్యుత్ ఉద్యోగులు

అర్వపల్లి : విద్యుత్ సంస్థల్లో పనిచేసే ఉద్యోగులకు రావాల్సిన పీఆర్‌సీని వెంటనే ప్రకటించాలని కోరుతూ రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు శనివారం స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2022 ఏప్రిల్ నుంచి రావాల్సిన పీఆర్‌సీని వెంటనే ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ ఉద్యోగుల సంఘం డివిజన్ సెక్రటరి ఎండీ రషీద్, నాయకులు సీహెచ్.నాగార్జున, వీరభద్రం, సబ్‌ఇంజనీర్ గిరిబాబు, ఎం.జోయల్, ఎల్.వెంకటేశ్వర్లు, జి.శ్యామ్‌సుందర్‌రెడ్డి, రాజేష్, సతీష్‌రెడ్డి, హబీబ్‌రెహ్మాన్, లాలు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ ఆయుష్మాన్ భారత్ నమోదు పరిశీలన


ఆన్‌లైన్ నమోదును పరిశీలిస్తున్న నాయకులు

భానుపురి : ఆరోగ్యశ్రీ ఆయుష్మాన్ భారత్ పథకంలో చేరేందుకు చేపట్టిన ఆన్‌లైన్ నమోదును సద్వినియోగం చేసుకోవాలని బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు గండూరి కృపాకర్ అన్నారు. శనివారం 45వ వార్డులో ఐదవ రోజు ఆరోగ్యశ్రీ ఆయుష్మాన్ భారత్ రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని పరిశీలించి మాట్లాడారు. ఆరోగ్యశ్రీ ఆయుష్మాన్ భారత్ నమోదు ద్వారా పేదలు కార్పొరేట్ ఆస్పత్రుల్లోనూ ఐదు లక్షల వరకు ఉచితంగా వైద్యం పొందే అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో గండూరి సుధీర్, శనగాని రాంబాబు, కుమ్మరికుంట్ల లింగయ్య, సుంకరి రమేష్, భరత్, మెరుగు రమేష్, నాగచారి, శ్రీను, ప్రవీణ్, మధు, జగదీష్, సతీష్, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ విద్యార్థులపై ఏబీవీపీ దాడిని ఖండించాలి

సూర్యాపేటటౌన్ : హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఎస్‌ఎఫ్‌ఐ విద్యార్థులపై ఏబీవీపీ విద్యార్థుల దాడిని ఖండించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బానోత్ వినోద్‌కుమార్, ధనియాకుల శ్రీకాంత్‌వర్మ శనివారం ప్రకటనలో తెలిపారు. యూనివర్సిటీలో శాంతియుత వాతావరణాన్ని ఏబీవీపీ ఉద్రిక్తం చేస్తోందని పేర్కొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎంఈఓ

నూతనకల్ : రాష్ట్ర రీసోర్స్ పర్సన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎంఈఓ రాములు నాయక్ శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీఆర్పీలు కనకం రవీందర్, లింగస్వామి, మల్లయ్య పాల్గొన్నారు.

విగ్రహ ఏర్పాటుకు శంకుస్థాపన

సూర్యాపేట రూరల్ : ఎర్కారం గ్రామంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు శనివారం డీసీఎంఎస్ చైర్మన్ వట్టె జానయ్య యాదవ్, ఎంపీపీ బీరవోలు రవీందర్‌రెడ్డి, జెడ్పీటీసీ జీడి భిక్షంలు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ రామసాని శ్రీనివాస్‌నాయుడు, సర్పంచ్ మౌనిక, ఎంపీటీసీ బానావత్ శాంతబాయి, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.


శంకుస్థాపన చేస్తున్న వట్టె జానయ్య యాదవ్

క్లుప్తంగా

కుక్కల బెడద నివారించాలని వినతి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సూర్యాపేట : సూర్యాపేట పట్టణంలో కుక్కల బెడదను నివారించాలని సీపీఐ(ఎంఎల్) ప్రజా పంథా ఆధ్వర్యంలో మున్సిపల్ మేనేజర్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రజా పంథా పట్టణ కార్యదర్శి గులాం హుస్సేన్ మాట్లాడారు. సూర్యాపేట పట్టణ పరిధిలో వీధి కుక్కల బెడద ఎక్కువైందని తెలిపారు. మున్సిపాలిటీ సిబ్బంది పట్టణంలో కుక్కల బెడదను తొలగించి ప్రజలను సురక్షితంగా ఉంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి ఎర్ర అఖిల్, రామోజీ, వాజిద్, నగేష్, ఎల్లయ్య, సైదులు తదితరులు పాల్గొన్నారు.

ఆరేళ్ల తరువాత విచారణకు అధికారుల నియామకం

సూర్యాపేట : జిల్లాలోని తూనికలు, కొలతల కార్యాలయంలో జరిగిన ఘటనపై ఆరేళ్ల తరువాత విచారణకు అధికారుల నియామకం జరిగింది. 2017లో జిల్లా కేంద్రంలోని తూనికలు, కొలతల కార్యాలయంలో మంటలు చెలరేగి అందులో ఉన్న ఫైల్స్, వస్తువులు దగ్ధమయ్యాయి. ఈ ఘటనలో జిల్లాకు చెందిన ఒక పెట్రోల్ బంకు అవినీతి ఆరోపణల ఫైల్స్ కాలిపోయాయి. ప్రమాదానికి షార్ట్ సర్క్యూట్ కారణమని అప్పటి జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారి వి. అశోక్‌రావు ఫిర్యాదు చేశారు. కానీ కావాలనే పెట్రోల్ పోసి తగులపెట్టారని, పెట్రోల్ బంకును కాపాడటానికి బంకుకు చెందిన వ్యక్తులతో కలిసి కార్యాలయంలోని ఫైల్స్, వస్తువులను దగ్ధం చేశారని అప్పట్లో కేసు నమోదైంది. ఈ సంఘటనతో అప్పుడు విధుల్లో ఉన్న అధికారిని సస్పెండ్ చేశారు. అయితే తాజాగా ఈ సంఘటనపై విచారణకు అధికారులను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. విచారణ అధికారిగా హైదరాబాద్‌కు చెందిన అసిస్టెంట్ కంట్రోలర్ సిద్ధార్థ్ కుమార్‌ను, ప్రెజెంటింగ్ అధికారిగా అసిస్టెంట్ కంట్రోలర్ ఎస్.రాజేశ్వర్‌లను నియమించింది.

విగ్రహ ఏర్పాటుకు ఆర్థిక తోడ్పాటు



మందుల సామేలును సన్మానిస్తున్న అంబేద్కర్ విగ్రహ నిర్మాణ కమిటీ సభ్యులు

నాగారం : మండల పరిధిలోని మామిడిపల్లి గ్రామంలో అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మాజీ చైర్మన్ మందుల సామేలు శనివారం తనవంతుగా రూ.10,000 ఆర్థిక తోడ్పాటు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ స్ఫూర్తితో యువత ముందుకు సాగాలన్నారు. అనంతరం కమిటీ సభ్యులు మందుల సామేలును శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పేరాల సాగర్‌చంద్ర, ఈశ్వర్, వీరేష్, శ్రీనివాస్, యాదగిరి, రాజీవ్, సురేష్, శ్రీను, మణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నర్సయ్య మృతి తీరని లోటు


నూతనకల్ : మండల పరిధిలోని చిల్పకుంట్ల గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పోలెపాక నర్సయ్య(65) మృతి పార్టీకి తీరని లోటని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడిపాటి నర్సయ్య అన్నారు. శనివారం అతడి మృతదేహంపై పార్టీ జెండా కప్పి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నాగం సుధాకర్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా కో ఆర్డినేటర్ బాజాల సుదర్శన్ రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు బత్తుల నాగమల్లు, పంతం వెంకన్న, సురేష్, మల్లయ్య, వెంకటనర్సు, రమేష్, రవి పాల్గొన్నారు.

సిటీ టాలెంట్ స్కూల్ వార్షికోత్సవం


డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

సూర్యాపేటటౌన్ : జిల్లా కేంద్రంలోని సిటీ టాలెంట్ స్కూల్ వార్షికోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

ఇన్‌చార్జ్ ఎంపీఓగా ఉపేందర్‌రావు



అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల ఇన్‌చార్జ్ ఎంపీఓగా రామన్నగూడెం పంచాయతీ కార్యదర్శి పి.ఉపేందర్‌రావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుత ఎంపీఓ సందీప్‌కుమార్ 3నెలలు సెలవుపై వెళ్లడంతో సీఈఓ ఆదేశాల మేరకు తాను ఇన్‌చార్జ్ ఎంపీఓగా బాధ్యతలు తీసుకున్నట్లు చెప్పారు. గ్రామపంచాయతీల అభివృద్ధిలో సర్పంచ్‌లు తనకు సహకరించాలని కోరారు.